క్లుప్తంగా

పన్ను వసూలుకు ఇంటింటికి కమిషనర్

ఇల్లెందు: ఈనెల 25లోపు ఇల్లెందు మున్సిపాలిటీ నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉంది. ఈ మేరకు ఇంటింటికి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ బయలు దేరారు. వారం రోజుల క్రితం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన ఇల్లెందు మున్సిపాలిటీని సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. దీంతో పన్ను వసూలుకు ఇంటికే వెళ్తున్నారు. శుక్రవారం ఇల్లెందు పట్టణంలో పలువురు నుంచి బకాయిలు స్వీకరించారు.

ఆరోగ్య మహాసభలను జయప్రదం చేయండి..

కొత్తగూడెంఅర్బన్: ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో ఈనెల 23న కొత్తగూడెం క్లబ్‌లో జరగనున్న ప్రకృతి – ఆరోగ్య మహాసభలను విజయవంతం చేయాలని, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, సంగం వెంకట పుల్లయ్య అన్నారు. శుక్రవారం బస్టాండ్ సమీపంలోని ప్రకృతి ఆశ్రమంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య పరిరక్షణ, మానసిక ఒత్తిడిని జయించడం ఎలా.. జల సంరక్షణ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం, ఆనందమయ జీవితం మొదలైన అంశాలపై విశ్లేషణ ఉంటుందని తెలిపారు.

అనుమతులు ఇప్పించండి..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని జీకే ఓసీ, ఇల్లెందు ఏరియాలోని జేకే ఓసీ ఎక్స్‌టెన్షన్ అనుమతులు వచ్చేలా చూడాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు శుక్రవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోన్‌లో మాట్లాడుతూ.. కొత్తగూడెం ఏరియాలో బొగ్గు ఉత్పత్తి తగ్గిపోవటం వలన కేటీపీఎస్ విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడుతుందన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని సంబంధిత పనులను వేగవంతం చేయాలని కోరారు.

కవితా దినోత్సవం..

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆంగ్ల కవితా సంపుటిని ప్రిన్సిపాల్ పద్మ ఆవిష్కరించారు. మాట్లాడుతూ... ఇంగ్లిష్ నేర్చుకోవడం ద్వారా అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. డాక్టర్ జే.మాధవి, టి.అరుణకుమారి, కామేశ్వరరావు, రమేష్, శ్రీనివాస్, విమల, దీపిక పాల్గొన్నారు.

24న చలో హైదరాబాద్

టేకులపల్లి: సమస్యల పరిష్కారం కోరుతూ.. ఈనెల 24న చలో హైదరాబాద్ కార్యక్రమం ఉన్నందున ఆరోజు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట చేయడం లేదని మధ్యాహ్న భోజన వర్కర్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి ఎంఈఓ కార్యాలయంలో సీఐటీయూ అనుబంధ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

25న విలీనసభ

ఇల్లెందురూరల్: ఈ నెల 25న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఇఫ్టూ అనుబంధ హమాలీ, మిల్ వర్కర్స్ యూనియన్ విలీనసభను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి పిలుపునిచ్చారు. మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ శుక్రవారం హమాలీ కార్మికులతో కలిసి విలీనసభ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం బరువులు మోసే హమాలీ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు దాటిన హమాలీ కార్మికులకు నెలకు రూ.6వేలు పింఛన్ మంజూరు చేయాలని కోరారు.

లోపాలను సవరించండి..

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో నెలకొన్న లోపాలను తక్షణమే సవరించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్ చేస్తుంటే వివరాలు తీసుకోవటం లేదని, ప్రభుత్వ లక్ష్యం నీరుగారే అవకాశం ఉందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గడువు తేదిని పొడిగించాలని కోరారు.

సౌకర్యాలు కల్పించండి..

జూలూరుపాడు: ఉపాధి కూలీల రోజు వారీ వేతనం రూ.600 చెల్లించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం, ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు బానోత్ ధర్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశాలను ఏఐయూకేఎస్, ఏఐపీకేఎంఎస్ జిల్లా ప్రతినిధుల బృందం సందర్శించి, పరిశీలించారు. మాట్లాడుతూ... ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. నీడ కోసం టెంట్లు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించాలన్నారు. అదేవిధంగా పలుగు, పార, తట్టలు అందజేయాలని కోరారు. కంగాల వెంకటమ్మ, వెంకటేశ్వర్లు, కల్తి శేఖర్, లింగాల రాములు, రమాదేవి, సునీత పాల్గొన్నారు.

ప్రగతి పథంలో గ్రెయిన్ మార్కెట్

- మార్కెట్‌కు కానుల వంట
- ఈసారి ఇల్లెందు గ్రెయిన్ మార్కెట్ కళకళ
- నిర్ణీత గడువుకు ముందే ప్రభుత్వ లక్ష్యం పూర్తి

ఇల్లెందు: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ గడువుకు ముందే లక్ష్యం దాటేసింది. జిల్లాలోనూ ఇల్లెందు మార్కెట్ ఆదాయం రాబడిలో అగ్రస్థానంలో ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం రూ.4.64 కోట్లు ఉండగా నేటికి రూ.4.68 కోట్లు సాధించింది. ఇంకా సీసీఐ, ధాన్యం కొనుగోలు నుంచి రావాల్సిన బకాయిలు సుమారు రూ.40 లక్షల వరకు ఉన్నాయి. మార్కెట్ అధికారులు పక్కా ప్రణాళికలతో ముందడుగు వేశారు. పదేళ్లలో సాధించిన ప్రగతి చూస్తే ఇల్లెందు మార్కెట్ ఆదాయం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. అధికారుల చిత్తశుద్ధికి ఇది నిదర్శనంగా మిగిలింది. ఈసారి ప్రభుత్వం విధించిన మార్కెట్ ఆదాయ లక్ష్యం పది రోజుల ముందే అందుకున్నారు. ఇల్లెందు మార్కెట్ యార్డులో సుమారు 50 మంది అనుమతి కలిగిన వ్యాపారులు ఉన్నారు.

ఇక వందల సంఖ్యలో అనధికార వ్యాపారులు ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు చేస్తున్నారు. జోరుగా జీరో వ్యాపారం చేస్తున్నా.. ఒకవైపు దానిని కట్టడి చేస్తూ మరోవైపు వ్యాపారులను లైసెన్స్‌లు తీసుకునేలా ప్రోత్సహిస్తూ మార్కెట్ ఆదాయం లక్ష్యం దిశగా నడిపించారు. ఇల్లెందు మార్కెట్ పరిధిలో ఆరు చెక్ పోస్టులు ఉన్నాయి. ఈ చెక్ పోస్టుల్లో మెజారిటీ గార్డులు ప్రైవేట్ వారే అయినా ఇల్లెందు మార్కెట్‌ను ప్రగతి పథంలోకి నడిపించారు. ఇదిలా ఉండగా ఇల్లెందు మార్కెట్ పరిధిలో మునుపెన్నడూ లేనంతగా మిర్చి కొనుగోలు కేంద్రాన్ని టేకులపల్లిలో ప్రారంభించి దిగ్విజయంగా రాష్ట్రంలో ఏ మార్కెట్‌లో పలకనంత ధర ఇక్కడి మిర్చి కేంద్రంలో పలికేలా చేశారు.



ఇల్లెందు మార్కెట్ ప్రధాన ద్వారం ▲

పదేళ్లుగా మార్కెట్ ఆదాయం

ఆర్థిక సంవత్సరం	ఆదాయం (రూ.లక్షల్లో)	ఆర్థిక సంవత్సరం	ఆదాయం (రూ.లక్షల్లో)
2014–15	171.16	2019–20	305.26
2015–16	196.78	2020–21	229.83
2016–17	229.02	2021–22	239.04
2017–18	186.63	2022–23	386.37
2018–19	160.53	2023–24	382.52
		2024–25	468.91

మార్కెట్ స్థితిగతులు ఇలా..

ఇల్లెందు మార్కెట్ యార్డులో ఆరు ఎకరాల స్థలంలో ఎనిమిది గిడ్డంగులు, 4,800 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాంలు ఉన్నాయి. ఇల్లెందు, గుండాల, గార్ల, బయ్యారం, సింగరేణి, కామేపల్లి, టేకులపల్లి మండలాల్లో 86 గ్రామాలు ఉన్నాయి. ఇల్లెందు మార్కెట్ యార్డు పరిధిలో గార్లలో ఉప మార్కెట్ ఉంది. గుండాల, టేకులపల్లి, బయ్యారం మండలాల్లో సైతం మార్కెట్ గోదాంలు ఉపయోగంలో ఉన్నాయి. వీటన్నింటినీ ఉపయోగించి రైతులకు మేలు చేస్తే ఇల్లెందు మార్కెట్‌లోనే సుమారు రూ.10 కోట్ల ఆదాయం వస్తుంది.

అందరి సహకారంతో..



ఈసారి ఇల్లెందు మార్కెట్ లక్ష్యం దిశగా అందరి సహకారంతో కృషి చేశాం. ఈఏడాది గడువు కన్నా పది రోజులు ముందే ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయం వచ్చింది. ముఖ్యంగా టేకులపల్లిలో మిర్చి మార్కెట్ నడిపించటం వల్ల రైతులకు మేలు జరుగుతోంది. ఇలా జిల్లాలో పండ్ల మార్కెట్ కూడా నడిపించే అవకాశం ఉంది. జిల్లాలో అత్యధికంగా మామిడి సాగు ఉంది. ఇక్కడి నుంచి విజయవాడ, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్తున్నాయి. ఇందుకు ప్రభుత్వ అనుమతి కోసం చూస్తున్నాం. ఏ వ్యాపారం చేసినా అనుమతి తప్పని సరి, కానీ ఇక్కడ అనుమతులు లేకుండా వ్యాపారం చేయటం పరిపాటిగా మారింది. ఇలా ప్రభుత్వానికి ఆదాయం రావడం లేదు.

– ఇ.నరేష్, మార్కెట్ కార్యదర్శి, ఇల్లెందు

బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాం..

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తిలో 11 రోజుల ముందే లక్ష్యం సాధించినట్లు ఏరియా జీఎం వి.కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఇల్లెందులోని తన చాంబర్‌లో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఇల్లెందు ఏరియాకు 41.30 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తిని 11 రోజుల ముందే అధిగమించినట్లు తెలిపారు. 21వ తేదీ నాటికి 100.12 శాతం బొగ్గు ఉత్పత్తి అన్ని ఏరియాల కంటే అగ్రస్థానంలో ఉన్నట్లు చెప్పారు. అత్యధిక శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినందుకు ఉద్యోగులు, కార్మికులను అభినందించారు.


వి.కృష్ణయ్య, ఏరియా జీఎం, ఇల్లెందు

లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం..


డాక్టర్ శ్యాంప్రసాద్, మేనేజర్, పీవీకే-5 గని

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పీవీకే-5 ఇంక్లైన్‌లో జియోలాజికల్ సమస్యల కారణంగా ఈ ఏడాది సంస్థ నిర్దేశించిన 3,39,380 లక్షల టన్నుల బొగ్గు లక్ష్యాన్ని సాధించలేకపోయామని మేనేజర్ డాక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 1,56,620 లక్షల టన్నుల ఉత్పత్తితో 46శాతం సాధించినట్లు చెప్పారు. వచ్చే సంవత్సరంలో పరిస్థితులు అనుకూలిస్తే 100శాతం ఉత్పత్తి సాధనకు కృషి చేస్తామన్నారు. సంస్థ పరిధిలోని 11 ఏరియాల్లో మూడు గనుల్లో ఒకటైన పీవీకే-5 గని సుమారు 70 సంవత్సరాల గని అని, దాదాపు 1000 అడుగుల లోతులో పనులు చేయాల్సి వస్తోందని, ప్రతీ 30 మీటర్లకు భూగర్భంలో వేడి పెరిగే అవకాశం ఉందన్నారు. సుమారు 720 మంది ఉద్యోగులకు దాదాపు 300 మంది మాత్రమే విధులకు హాజరవుతున్నారని, దీనివలన కూడా కొంత ఉత్పత్తి వెనుకంజకు కారణమన్నారు. కార్మికులు గైర్హాజరు కాకుండా ఉండేందుకు గని వద్ద, కార్మిక కుటుంబాలతో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గనిలో సమస్యలను అధిగమించి రానున్న 2025–26 ఆర్థిక సంవత్సరంలో 100 శాతం ఉత్పత్తిని సాధిస్తామని తెలిపారు.

అడవులను సంరక్షించాలి

పాల్వంచరూరల్: భవిష్యత్ తరాల కోసం అడవులను సంరక్షించాలని పాల్వంచ అటవీ డివిజన్ ఎఫ్‌డీఓ కట్టా దామోదర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఎఫ్‌డీఓ మొక్కలు నాటారు. మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా ఐదు బిలియన్లకు పైగా ప్రజలు ఔషధ, ఆహార, జీవనోపాధి కోసం అటవీ, కలపయేతర అటవీ ఉత్పత్తులను వినియోగిస్తున్నారని చెప్పారు. అడవులు, చెట్ల గింజలు, పండ్లు, విత్తనాలు, వేర్ల దుంపలు, ఆకులు, పుట్టగొడుగులు, తేనె కీటకాలకు గొప్ప మూలం అన్నారు. ఇవి ప్రజలకు ఆహారంలో అవసరమైన పోషకాలను అందిస్తున్నాయని ఇంతటి ప్రయోజనాలు కలిగిన చెట్లను నరికివేయకుండా ప్రతీఒక్కరు సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.మాధవి, ఎకో క్లబ్ కోఆర్డినేటర్ డి.రమేష్, డాక్టర్ వేముల కామేశ్వరరావు, ధర్మరావు, అరుణకుమారి, విజయప్రసాద్, భానుప్రవీణ్, విమల, దీపిక, కావ్య, కరీమా, పర్వీన్, మధుబాల తదితరులు పాల్గొన్నారు.


పాల్వంచరూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్క నాటుతున్న ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డి

జూలూరుపాడు: అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా పడమటనర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జూలూరుపాడు ఎఫ్ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఎఫ్ఆర్‌ఓ మాట్లాడుతూ.. అడవులు అంతరించిపోవడం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలన్నారు. అటవీ విత్తన సేకరణ, శుద్ధి, నిల్వ, ఔషధ గుణాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ బానోత్ జుంకీలాల్, అటవీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లీ.. నీ బిడ్డలను కనికరించు..!


నిరసన తెలుపుతున్న కేశవాపురం గ్రామస్తులు

పాల్వంచరూరల్: నిన్ను దర్శించి మొక్కులు తీర్చుకున్న అందరికీ న్యాయం చేస్తున్నావు.. ఏళ్ల తరబడి నీ సేవ చేస్తున్న స్థానిక బిడ్డలకు కూడా న్యాయం జరిగేలా దీవించూ తల్లీ.. అంటూ పెద్దమ్మతల్లిని వేడుకున్నారు. కేశవాపురం గ్రామానికి చెందిన వారికి ఆలయ పాలక మండలిలో స్థానం కల్పించాలని కోరుతూ శుక్రవారం నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతూ ప్రదర్శనంగా వెళ్లి పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి వినతిపత్రం అందజేశారు. అనేక సంవత్సరాలు అలయ అభివృద్ధి కోసం కృషి చేస్తూ అమ్మవారికి సేవలు అందిస్తున్న గ్రామస్తులకు ఆలయ కమిటీలో స్థానం కల్పించకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గంధం నర్సింహారావు, కొండం పుల్లయ్య, వెంకన్న, గంధం సతీష్, వీరభద్రం, వెంగళరావు, సత్యనారాయణ, బానోతు కుమార్, రమేష్, ఉదయ్, కృష్ణ, భాస్కర్, రాము, మహేష్, నర్సింహారావు, నాగేశ్వరరావు, శ్రీరంగందేవి, స్వరూప, మల్లేశ్వరి, సౌజన్య, సుమ పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గౌరవం

ఇల్లెందురూరల్: చదువుతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని ఎస్సై సందీప్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువక కేంద్రం సంయుక్తంగా శుక్రవారం కళాశాల విద్యార్థులకు బ్లాక్ లెవల్ క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువు జీవితానికి దిశ, దశను చూపితే వ్యాయామం, క్రీడలు శరీర ధారుడ్యాన్ని పెంపొందించి అందుకు మానసిక సన్నద్ధతను ఏర్పరుస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎస్సైగా ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ మరింత గౌరవప్రదమైన స్థానం కోసం శ్రమించి గ్రూప్–1లో అత్యున్నత స్థానం పొందిన సందీప్ నేటి యువతరానికి మార్గదర్శిగా నిలుస్తున్నారని కొనియాడారు. ప్రతీ విద్యార్థి తాను ఏ స్థానంలో ఉన్నా మరింత ఉన్నతంగా ఎదిగేందుకు అహర్నిశలు కృషి చేయాలన్నారు. అనంతరం క్రీడాపోటీలలో విజేతలకు జ్ఞాపికలను బహూకరించారు.


మాట్లాడుతున్న ఎస్సై సందీప్

పేదలకు విద్యను దూరం చేస్తున్న ప్రభుత్వం

కొత్తగూడెంఅర్బన్: విద్యను అట్టగుడు వర్గాలకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దూరం చేస్తోందని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యా రంగానికి 15 శాతం నిధులను కేటాయిస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించి కేవలం 7.57 శాతం కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. దీంతో ప్రతీ మండల కేంద్రానికో హైస్కూల్, జూనియర్ కాలేజీ, ప్రతీ నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల, ప్రతీ జిల్లా హెడ్ క్వార్టర్‌లో పేజీ కళాశాల నిర్మించడం ఎలా సాధ్యమవుతుందో రాష్ట్ర ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని హామీని ఇచ్చి 16 నెలలలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్ లో 30 శాతం నిధులను కేటాయించాల్సిన ప్రభుత్వం 7.57 శాతం కేటాయించి విద్యారంగాన్ని ఏ విధంగా బాగు చేస్తారో స్పష్టం చేయాలన్నారు.

'రాయల' ఆలోచనతోనే మాస్‌లైన్ ఆవిర్భావం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఇల్లెందురూరల్: న్యూడెమోక్రసీ అవకాశవాదం, ఆరాచక వాదంతో రాజీలేని పోరాటం చేసి విసిగిపోయిన రాయల సుభాష్‌చంద్రబోస్ ఆలోచన విధానం నుంచే మాస్‌లైన్ ఆవిర్భవించిందని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. తుంటు బాలుతండా గ్రామంలో శుక్రవారం మాస్‌లైన్ మండల స్థాయి జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యూడెమోక్రసీలో సుభాష్ చంద్రబోస్ మరికొందరు పెద్దలు చేసిన అంతరంగిక పోరాటాన్ని తొక్కిపట్టి బోస్‌ను న్యూడెమోక్రసీ రాజకీయ వారసుడిగా ప్రపంచానికి చూపించే కుట్ర జరుగుతోందని, మాస్‌లైన్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో రివిజనిస్టులుగా, మితవాదులుగా ముద్ర వేసిన నేతలు నేడు తామే బోస్ రాజకీయ వారసులమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నేడు దేశంలో విప్లవ పార్టీలు మాస్‌లైన్‌ను బలపరుస్తూ చర్చిస్తున్న సందర్భంలో న్యూడెమోక్రసీ నాయకత్వం వారి శ్రేణులను నిలబెట్టుకోవడం కోసం విచిత్రమైన ప్రచారాలకు తెరలేపుతోందని ఆక్షేపించారు. కార్యక్రమంలో గుర్రం అచ్చయ్య, నాయిని రాజు, ఈసం శంకర్, పూనెం కుమార్, బుర్ర వెంకన్న, సావిత్రి, వాంకుడోత్ అజయ్, ధరావత్ దేవా, శాంతారావు, శంకర్, బుర్ర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా సామ్రాజ్యవాదాన్ని తిప్పికొట్టాలి..

జూలూరుపాడు: అమెరికా సామ్రాజ్యవాదాన్ని, బీజేపీ మతోన్మాదాన్ని తిప్పి కొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డోనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని అమెరికా ప్రపంచ వాణిజ్య యుద్ధం చేస్తోందని, అందులో భాగంగానే భారతదేశంపై సుంకాలు విధిస్తున్నట్లు చెప్పారు. అమెరికాలోని భారత పౌరులను బానిసలుగా చూస్తూ సంకెళ్లు వేసి తీసుకొస్తున్నా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించడం లేదని దుయ్యబట్టారు. భగత్‌సింగ్ బలిదానం స్ఫూర్తితో అమెరికా సామ్రాజ్యవాదాన్ని, బీజేపీ కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలని ప్రజలను కోరారు. కొండపల్లి శ్రీధర్, యాసా నరేష్, గార్లపాటి వెంకటి, వి.చంద్రరావు, రాములు, బానోత్ ఇస్రా పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల బరిలో 41 మంది

కొత్తగూడెంటౌన్: 27న జరగనున్న కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఎన్నికల బరిలో ఆరు కేటగిరీలలో 41 మంది పోటీలో నిలిచారని చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ పలివెల గణేష్‌బాబు తెలిపారు. శుక్రవారం కోర్టు లైబ్రరీ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 41 మంది నామినేషన్లు వచ్చినట్లు చెప్పారు. 22న విత్‌డ్రా, సాయంత్రం 4గంటలకు తుది జాబితా, 5 గంటలకు బార్ నోటీస్ బోర్డుపై ఉంచుతామని తెలిపారు.

'యువ వికాసం' అమలు చేయాలి

టేకులపల్లి: రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తులు అనుమతించాలని పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ... పదేళ్లుగా రేషన్ కార్డులు జారీ కాకపోవడంతో నిరుద్యోగ యువత ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. కార్డులతో సంబంధం లేకుండా దరఖాస్తులను అనుమతించాలని, లేదంటే సంఘం తరఫున ఉద్యమాలు చేపడతామని వెల్లడించారు.

మహిళా సమన్వయ సమితి సమావేశం

ఇల్లెందు: లోకమాత అహల్య హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవాలలో భాగంగా మహిళా సమన్వయ సమితి సమావేశం జరిగింది. శుక్రవారం శ్రీరామాలయంలో జరిగిన కార్యక్రమంలో ఖమ్మం విభాగ్ సంయోజిక జ్యోతిర్మయి మాట్లాడుతూ.. హోల్కర్ తన జీవితంలో పలు ఆటుపోట్లు ఎదుర్కొన్నారని, ప్రజలందరినీ తన పిల్లల్లా చూస్తూ వారిలో చైతన్యం నింపినట్లు తెలిపారు. ధర్మరక్షణకు ఆమె మార్గాన్ని అనుసరించాలని కోరారు. మేడూరి సూర్యకుమారి, పిల్లి ప్రసూన రాణి, విజయలక్ష్మి, విజయ, సరిత, సౌజన్య పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసనకు మద్దతు


నిరసన శిబిరంలో జర్నలిస్టులతో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

కొత్తగూడెంఅర్బన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం జర్నలిస్టులు చేస్తున్న నిరసన కార్యక్రమం రెండోరోజు శుక్రవారం కొనసాగింది. నిరసన శిబిరానికి వివిధ పార్టీల నాయకులు, సంఘాల నాయకులు చేరుకొని సంఘీభావం తెలిపి, మద్దతు ప్రకటించారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యదర్శి, బీసీ సంఘం నాయకుడు మల్లెల రామనాథం మాట్లాడుతూ... ఇళ్ల స్థలాలు జర్నలిస్టుల హక్కు అని, వారికి సాధారణ ధరకు స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు రంగాకిరణ్ మాట్లాడుతూ... జర్నలిస్టులు పదేళ్లుగా ఇళ్ల స్థలాల కోసం అనేక ఉద్యమాలు చేస్తున్నారని, ప్రభుత్వం ఎకరానికి రూ.2.30 కోట్లు చెల్లించాలనడం దుర్మార్గమని, ఉచితంగా స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, బీజేపీ నాయకులు గొడుగు శ్రీధర్, రాయుడు నాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు నవతన్, పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

ధర్నాను జయప్రదం చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చిన ఐదు కనీస వేతనాల జీఓలను గెజిట్ చేయాలని, ఈనెల 22న హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి రామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని టీయూసీఐ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు బ్లాకులను సింగరేణికే అప్పజెప్పాలని, సింగరేణి బొగ్గు బావుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. బడ్జెట్‌లో కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 2021జూన్‌లో విడుదల చేసిన జీఓలను నేటికీ గెజిట్ ముద్రించకపోవటం దుర్మార్గమన్నారు. అనాటి కేసీఆర్ ప్రభుత్వం ఈనాటి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దొందు దొందేనన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.మదుసూదన్‌రెడ్డి, ఎస్‌కే యాకూబ్‌షావలీ, పెద్దబోయిన సతీష్, ఏదులాపురం గోపాలరావు, గోనెల రమేష్, నూప భాస్కర్, పాయం వెంకన్న, రాజశేఖర్, చంద్రశేఖర్, సుందర్, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం


ఇల్లెందు: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. ఆయా పరీక్ష కేంద్రాలను కోఆర్డినేటర్లు పర్యవేక్షించారు. విద్యార్థులు తమ వెంట వచ్చిన తల్లిదండ్రులు, గురువుల ఆశీస్సులు తీసుకొని పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లారు. పరీక్ష రాసి బయటకు వచ్చే వరకు తల్లిదండ్రులు అదే ప్రాంతంలో గడిపారు. – సాక్షి నెట్‌వర్క్


జూలూరుపాడు: హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


టేకులపల్లి: సులానగర్ పరీక్ష కేంద్రం వద్ద...


టేకులపల్లి: బోడు జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు


ఇల్లెందు: గర్ల్స్ హైస్కూల్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు


పాల్వంచరూరల్: కిన్నెరసాని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



పాల్వంచ: బాలికల పాఠశాల వద్ద..


ఇల్లెందురూరల్: రొంపేడు పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు